# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

## దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ

**అక్టోబర్ 10, 2013**

**మే 25న జరిగిన జీరంఘాటీ దాడి, రాబోయే ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రసార మాధ్యమాలకు సంబంధించిన పలువురు ప్రతినిధులు మమ్మల్ని అనేక ప్రశ్నలడిగారు. అటువంటి కొన్ని ప్రశ్నలకు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి కామ్రేడ్ రామన్న ఒక ఇంటర్వ్యూ ద్వారా జవాబులిచ్చారు. దాని పూర్తి పాఠాన్ని మేం మీడియాకు విడుదల చేస్తున్నాం.**

**ప్రశ్న – రాబోయే ఎన్నికల పట్ల మీ పార్టీ ఎటువంటి విధానాన్ని అనుసరిస్తుంది?**

**జవాబు –** ఎప్పటిలాగే ఈసారి కూడా మేం ఎన్నికలను బహిష్కరించండి అనే పిలుపునే ఇస్తున్నాం. ఎందుకంటే మేం ఈ ఎన్నికలు పచ్చి బూటకమని భావిస్తాం. ఎన్నికలంటే దోపిడీ దొంగల్లో నుండి ఏయే సభ్యులు రాబోయే అయిదు సంవత్సరాల కాలంలో ప్రజలను దోచుకోవాలో, పీడించాలో నిర్ణయించుకునే సందర్భం మాత్రమే. ఎన్నికల పట్ల ప్రజల్లో కూడా ఎటువంటి ఉత్సాహం కనబడడం లేదు. ఎందుకంటే ఎన్నికల ద్వారా తమ జీవితాల్లో ఎటువంటి మౌలిక మార్పు వచ్చేది లేదని ప్రజలకు బాగానే తెలుసు. కేవలం కొన్ని స్థానిక అవసరాలు, కుల లేదా మత భావనలు, డబ్బు ప్రలోభాలు, భయాలు, బెదిరింపులు, మద్యం వంటి కారణాలతో ప్రజలు ఓట్లు వేస్తున్నారు. ప్రస్తుత దోపిడీ వ్యవస్థను సాయుధ విప్లవం ద్వారా సమూలంగా మార్చివేసి దోపిడీ రహిత, నూతన ప్రజాస్వామ్య సమాజాన్ని స్థాపించడమే మా లక్ష్యం. ఎన్నికల ద్వారా ఈ మార్పు సాధ్యం కాదు.

**ప్రశ్న – ఈసారి ఎన్నికల బహిష్కరణ కూడా హింసాత్మకంగా వుంటుందా?**

**జవాబు –** హింసాత్మకంగా ఉండడం, వుండకపోవడం అనేది మా మీద మాత్రమే ఆధారపడి వుండదు. ప్రతిసారీ లాగానే ఈసారి కూడా దోపిడీ ప్రభుత్వాలు పెద్ద ఎత్తున సాయుధ బలగాలను దించి ఎన్నికలను 'నిష్పాక్షికంగా', 'స్వేచ్ఛగా' జరిపే పేరుతో భారీ నిర్బంధకాండను అమలుచేస్తున్నాయి. గ్రామాలపై దాడులు, కూంబింగ్ ఆపరేషన్‌లు, అరెస్టులు, చిత్రహింసలు, బూటకపు ఎన్‌కౌంటర్లు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. ఆత్మరక్షణ కోసం ప్రజలు ఈ నిర్బంధాన్ని ప్రతిఘటించడం అనివార్యం. కనుక, ఎన్నికల బహిష్కరణ క్యాంపెయిన్‌ను విఫలం చేయడం కోసం ప్రభుత్వం నిర్బంధకాండను ప్రయోగిస్తే, హింసాత్మక చర్యలకు దిగితే దానికి ప్రతిఘటన తప్పని సరిగా వుంటుందని మాత్రమే మీ ప్రశ్నకు జవాబుగా నేను చెప్పగలను.

**ప్రశ్న – ఓట్లు వేసేవారి వేలు నరికేస్తానే మీ బెదిరింపులు ఎంత వరకు సమంజసం?**

**జవాబు –** ఓటు వేసేవారి వేలు కత్తిరిస్తామని మేం బెదిరిస్తామనేది ఉత్త చెత్తవాగుడు మాత్రమే. 33 ఏళ్లుగా సాగుతున్న దండకారణ్య వుద్యమ చరిత్రలో మేం ఇటువంటి బెదిరింపులకు, లేదా ఎవరి మీదనైనా ఇటువంటి భౌతిక దాడులకు పాల్పడ్డ ఉదాహరణ ఒక్కటి కూడా దొరకదు. ఇది నిజానికి దోపిడీ ప్రభుత్వాలు, వాటి కార్పొరేట్ మీడియా చేస్తున్న దుష్ప్రచారం. ఎన్నికల సమయంలో ప్రత్యేకించి చేసే దుష్ప్రచారం. వాస్తవానికి ఎన్నికల బహిష్కరణ అనేది ఒక రాజకీయ కార్యక్రమం. ఇందులో ప్రజలను చైతన్యవంతం చేయడమే ప్రధానంగా వుంటుంది. ఏ రాజకీయ ఉద్దేశ్యం కోసమైనా ప్రజలను భయపెట్టి, బెదిరించి సమీకరించగలమనే నమ్మకం మాకు కొంచెం కూడా లేదు.

కానీ ఈ విషయంలోని రెండవ పార్శ్వాన్ని చూస్తే వాస్తవానికి ప్రభుత్వమే ఇలా చేస్తుందని తెలుస్తుంది. ఓట్లు వేయకపోతే చెడు పరిణామాలు ఎదుర్కోవల్సి వస్తుందని ప్రజలను బెదిరిస్తుంది. ఓట్లు వేయకపోతే రేషన్ కార్డులు జప్తు చేసుకుంటామని, బియ్యం ఇవ్వమని, మావోయిస్టులని చెప్పి జైల్లో పెడతామని, చంపేస్తామని బెదిరిస్తుంది. కానీ మీడియాలో ఇటువంటి వార్తలు ఎక్కడా కనబడవు.

**ప్రశ్న – ఓటు వేయడం ప్రజల ప్రజాస్వామిక హక్కు. ఎన్నికల బహిష్కరణ పిలుపునిస్తూ మీరు ఈ హక్కును హరించడం లేదా?**

**జవాబు –** ప్రజలకు ఓటు వేసే హక్కు ఉన్నట్టే, ఓటు వేయకుండా వుండే హక్కు కూడా వుంటుంది. ఎన్నికల బహిష్కరణ కూడా ప్రజలు ప్రజాస్వామిక పద్ధతిలో నిరసన తెలియజేసే ఒక రూపం. మేం ప్రజలకు చెందిన ఏ హక్కునూ హరించడం లేదు. తమకున్న అన్ని హక్కులను గుర్తించాలనీ, వాటిని ఉపయోగించుకోవాలనీ ప్రజలకు చెబుతున్నాం. ఒకవేళ ఏ వ్యక్తికైనా అభ్యర్థుల్లో ఎవరూ నచ్చకపోతే 'పైన వున్న ఎవరూ కాదు' అనే ఒక ప్రత్యామ్నాయాన్ని ఎంచుకునే ఏర్పాటు వుండాలని, ఇటీవల సుప్రీం కోర్టుకు కూడా తీర్పు చెప్పాల్సి వచ్చింది. దీనర్థం, ప్రజల్లో రోజు రోజుకూ ఎన్నికల ప్రక్రియ పట్ల ఆసక్తి తగ్గుతూ వస్తున్నదనే విషయాన్ని, ప్రస్తుత వ్యవస్థలోని ఒక భాగమైన కోర్టులు కూడా ఒప్పుకోవాల్సి వచ్చింది. కాబట్టి ఎన్నికల బహిష్కరణ కూడా ప్రజలకు వుండాల్సిన ప్రజాస్వామిక హక్కు. అంతే కాదు ప్రస్తుత పార్లమెంటరీ

ప్రజాస్వామ్యాన్ని సమూలంగా తిరస్కరించే హక్కు కూడా ప్రజలకు వుంది.

**ప్రశ్న – మరయితే ఈ పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ప్రత్యామ్నాయంగా మీరు ఏం తీసుకురావాలనుకుంటున్నారు?**

**జవాబు –** కార్మిక, కర్షక, పెటీబూర్జువా, జాతీయ బూర్జువాలతో కూడిన ఐక్యసంఘటన నేతృత్వంలోని (అధికారం చెలాయించే) నూతన ప్రజాస్వామ్యమే ఏకైక, నిజమైన ప్రత్యామ్నాయం అనేది మా స్పష్టమైన అభిప్రాయం. ప్రస్తుతమున్న వ్యవస్థపై సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల, భూస్వాముల నియంత్రణ కొనసాగుతున్నది. ఇది శ్రామిక, పీడిత ప్రజల పట్ల నియంతృత్వం తప్ప మరేమీ కాదు. కనుక, దీన్ని ధ్వంసం చేసి ప్రజల నిజమైన ప్రజాస్వామ్యాన్ని నిర్మించడమే ఏకైక ప్రత్యామ్నాయం. దేశంలో కొనసాగుతున్న విప్లవోద్యమం ఫలితంగా నేడు దండకారణ్యం సహా దేశంలోని మరికొన్ని చోట్ల ప్రజా రాజ్యాధికార అంగాలు నిర్మాణం అవుతున్నాయి. దండకారణ్యంలో 'క్రాంతికారీ జనతన సర్కార్'ల పేరుతో గుర్తింపు పొందిన ఈ నూతన ప్రజా రాజ్యాధికార అంగాల నేతృత్వంలో ప్రజల నిజమైన అభివృద్ధి కేంద్రంగా కొన్ని పనులు జరుగుతున్నాయి. విప్లవ భూసంస్కరణలు, నీటి పారుదల వ్యవస్థ, విద్య, ఆరోగ్యం మొదలైన రంగాల్లో నూతన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇవి నేడు అత్యంత ప్రాథమిక స్థాయిలో, చాలా పరిమిత రంగాల్లోనే వున్నప్పటికీ, ఇవి ప్రగతిశీలమైనవి, వృద్ధి చెందే క్రమంలో వున్నవి. ఇక్కడ ఉదయిస్తున్న ప్రజా రాజ్యాధికార వ్యవస్థ ప్రజలను స్వావలంబన దిశగా నడిపిస్తుంది. ఇదే దేశ ప్రజల ముందున్న ప్రత్యామ్నాయం.

**ప్రశ్న – వేర్వేరు ఎన్నికల పార్టీల పట్ల మీ వైఖరి ఎలా వుంటుంది?**

**జవాబు –** ఈ ఎన్నికల బహిష్కరణ కార్యక్రమంలో మా ముఖ్య నినాదం – "అవినీతికర, ప్రజా వ్యతిరేక, దేశద్రోహకర, ఫాసిస్టు బీజేపీ, కాంగ్రెస్‌లను తరిమికొట్టండి". దేశంలో సామ్రాజ్యవాద నిర్దేశిత నయా ఉదారవాద విధానాలను అమలు చేస్తూ. అంతులేని దేశ ప్రకృతి సంపదలను, శ్రమ శక్తిని, ఇతర అన్ని వనరులను కార్పొరేట్ల పరం చేయడంలో ఈ రెండు పార్టీలది ప్రధాన పాత్ర అని మేం భావిస్తున్నాం. ఛత్తీస్‌గఢ్‌లో మొదట సల్వాజుడుం పేరుతో, ఇప్పుడు ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో అత్యంత వినాశకరమైన నిర్బంధాన్ని కొనసాగించి వందలాది ప్రజల ప్రాణాలను బలిగొనడంలో ఈ రెండు పార్టీల పాత్ర వుంది. అందుకని ఈ రెండు పార్టీల నాయకులను గ్రామాల్లో కాలుపెట్టనివ్వకుండా తరిమికొట్టాలని మేం ప్రజలకు పిలుపునిస్తున్నాం. ఇక సీపీఐ, సీపీఎం, బీఎస్‌పీ, గోండ్వానా గణతంత్ర్ పార్టీ, ఛత్తీస్‌గఢ్ స్వాభిమాన్ మంచ్ తదితర ఇతర పార్టీల విషయానికొస్తే – వీటి వద్ద కూడా ప్రత్యామ్నాయ కార్యక్రమం ఏమీ లేదు. ఈ పార్టీలన్నీ కూడ పైకి ఏం చెప్పినా దోపిడీ వర్గాలకే ప్రాతినిధ్యం వహిస్తాయి. ఇవి మా ప్రాంతాలకు వస్తే ప్రజలు నిరసన తెలియజేస్తారు.

**ప్రశ్న – గత పది సంవత్సరాల బీజేపీ పాలనను మీరెలా అంచనా వేస్తారు?**

**జవాబు –** ఒక్కమాటలో చెప్పాలంటే బీజేపీ పాలన నిర్బంధం, వినాశనాలకు మారుపేరుగా వుంది. 2000 నవంబర్ 1న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఏర్పడినపుడు, తమ జీవితాల్లో కొంతైనా మార్పు వస్తుందని ప్రజలు కలగన్నారు. కానీ పదమూడు సంవత్సరాలు కావొస్తున్నా అలాంటిదేమీ జరగలేదు. కాంగ్రెస్ పాలన వుండిన మొదటి మూడు సంవత్సరాల్లో రాష్ట్ర రవాణా సంస్థను ప్రైవేటీకరించారు. అజిత్ జోగి ప్రభుత్వం శివనాథ్ నదీ జలాలను ఒక ప్రైవేట్ కంపెనీకి అమ్మేసింది. విప్లవోద్యమాన్ని అణచివేయడానికి బస్తర్‌లో మొదటిసారి అర్ధసైనిక బలగాలు దిగాయి. ఆనాడు కేంద్రంలో అధికారంలో వున్న ఎన్‌డీఏ ప్రభుత్వం బాల్కోను అమ్మితే రాష్ట్ర ప్రభుత్వం గోల చేసింది. కానీ అది కూడా బడా, విదేశీ పెట్టుబడిదారుల శ్రేయస్సుకే పాటుపడ్డది. ప్రపంచ బ్యాంకు షరతులను అమలు చేస్తూ ప్రభుత్వ వుద్యోగాల భర్తీని ఆపివేసింది. ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిపై స్వారీ చేస్తూ డిసెంబర్ 2003లో ఛత్తీస్‌గఢ్‌లో మొదటిసారి బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

ప్రతిపక్షంలో వున్నపుడు బీజేపీ ఏ విధానాలను వ్యతిరేకించిందో, అధికారంలోకి వచ్చిన తర్వాత సరిగ్గా అవే విధానాలను అమలు చేస్తూ తన రెండు నాల్కల వైఖరిని స్పష్టంగా ప్రదర్శించుకుంది. అపార ఖనిజ, అటవీ సంపదలతో విలసిల్లే ఛత్తీస్‌గఢ్‌లో గత పది సంవత్సరాలుగా కార్పొరేట్ దోపిడీ నగ్నంగా నాట్యం చేస్తున్నది. దాని పారిశ్రామిక, గనుల విధానాలన్నీ ప్రజా వ్యతిరేకమైనవే. దేశ ప్రజల ప్రయోజనాలకు గొడ్డలిపెట్టుగా అది పెట్టుబడిదారులకు, బహుళజాతి కంపెనీలకు ఎర్ర తివాచీని పరుస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం శివనాథ్ నదీ జలాలను అమ్మివేస్తే, రమణ్ ప్రభుత్వం మరెన్నో నదుల జలాలను అమ్మేసింది. తొమ్మిది వందల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందిస్తున్న జాంజ్‌గీర్–చంపా జిల్లాలోని రోగ్దా ప్రాజెక్టును కూడా పూడ్చివేసి ఒక ప్రైవేట్ కంపెనీకి అమ్మిన 'ఘనత' కూడా రమణ్ ప్రభుత్వానికే దక్కింది. ధాన్యాగారంగా చెప్పుకునే ఛత్తీస్‌గఢ్‌లో 2000–11 నడుమ 14,340 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ప్రభుత్వం రైతులకు ఎంత సహాయకారిగా వుందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.

2005లో బీజేపీ కాంగ్రెస్‌తో కుమ్మక్కయ్యి సల్వాజుడుంను నడిపింది. ఆ రోజుల్లోనే అది టాటా, ఎస్సార్‌లతో రెండు భారీ ఉక్కు పరిశ్రమలను స్థాపించడానికి ఎంఓయూలపై సంతకం చేసింది. కార్పొరేట్ దోపిడీకి దారిని సుగమం చేయడం కోసమే సల్వాజుడుంను నడిపారనేది ఇప్పుడైతే అందరికీ స్పష్టంగా తెలిసిపోయింది. దాని తర్వాత ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో మరొక ఫాసిస్టు అధ్యాయం మొదలైంది. గ్రామాలను తగలబెట్టడం, హత్యలు, బలాత్కారాలు చేయడం, దోచుకోవడం మొదలైనవి ప్రభుత్వ సాయుధ బలగాల దినవారీ చర్యలుగా మారాయి. రమణ్ ప్రభుత్వ ఆదివాసీ వ్యతిరేక చరిత్రను అర్థం చేసుకోవడానికి ఇది ఒక ఉదాహరణ మాత్రమే.

రమణ్ ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాలకు సాగిలాపడుతూ, ఒకవైపు రైతుల నుండి భూమిని గుంజుకుంటూ మరోవైపు ఒకటి/రెండు రూపాయలకు కిలో బియ్యం ఇస్తున్నట్టు చాటింపు వేసుకుంటున్నాడు. అవినీతి, కుంభకోణాల్లో నిండా మునిగిపోయి కూడా అభివృద్ధి గురించి వల్లెవేయడం అతని మోసకారితనానికి స్పష్టమైన నిదర్శనం. బొగ్గు కుంభకోణం, ఇందిరా ప్రియదర్శిని బ్యాంకు కుంభకోణం, ధాన్యం కుంభకోణం మొదలైన వాటిలో రమణ్ ప్రభుత్వం చాలా అపఖ్యాతిపాలైంది. అయినప్పటికీ కార్పొరేట్ మీడియా అతన్ని స్వచ్ఛమైన ఇమేజ్ గలవాడుగా స్వీయాత్మకంగా చిత్రిస్తున్నది. బీజేపీ పాలనలో మహిళలకు ఎంత భద్రత, గౌరవం లభిస్తున్నాయో సోనీ సోడీ, మీనా ఖల్కో, ఝులియామారీకాండ మొదలైన ఉదాహరణల నుండి సులభంగానే అంచనా వేయవచ్చు.

బీజేపీ ప్రభుత్వం ఉద్యోగ వ్యతిరేక ప్రభుత్వంగా కూడ అపఖ్యాతి పాలయింది. శిక్షా కర్మీలు, అటవీ ఉద్యోగులు, అంగన్‌వాడీ వుద్యోగులు, నాలుగవ తరగతి శ్రేణికి చెందిన ఉద్యోగులు, పంచాయితీ కార్యదర్శులు – దాదాపు అన్ని సెక్షన్లు పలుసార్లు ఆందోళనా భేరి మోగించారు. ప్రభుత్వం అన్నిపోరాటాలకూ దమనకాండతోనే జవాబిచ్చింది. వాళ్ల న్యాయమైన డిమాండ్లను ప్రతిసారీ తొక్కిపడేసింది.

ఈ విధంగా గత పది సంవత్సరాల బీజేపీ పాలన ప్రజా వ్యతిరేకత, నిర్బంధం, దోపిడీలతోనే కొనసాగింది.

**ప్రశ్న – రమణ్ ప్రభుత్వం 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్', 'క్రెడిబుల్ ఛత్తీస్‌గఢ్' మొదలైన మాటలు చెబుతూ అభివృద్ధి చేశానని చెప్పుకుంటున్నది. మీరు దీన్ని ఎలా చూస్తారు?**

**జవాబు –** అభివృద్ధి విషయంలో రమణ్ చెబుతున్న దాన్ని కొట్టివేయడానికి ప్రభుత్వ గణాంకాలే సరిపోతాయి. రమణ్ చెబుతున్న దానికి భిన్నంగా ఛత్తీస్‌గఢ్ వృద్ధి రేటు 8 శాతంకు దరిదాపుల్లోనే వుంది. ఇది మిజోరాం వంటి కొన్ని చిన్న రాష్ట్రాల కంటే కూడ చాలా తక్కువ. వృద్ధిరేటు గణాంకాలను బట్టి ప్రజల జీవన ప్రమాణాలలో ఎంత అభివృద్ధి జరిగిందనేది అంచనా వేయడం అసలే సాధ్యం కానప్పటికీ గణాంకాల జూదంలో కూడా రమణ్ ప్రభుత్వం వెనుకబడ్డట్టు రుజువైంది. నిజానికి 'అభివృద్ధి' రమణ్ ప్రభుత్వ దృక్పథమే దోషపూరితమైనది. పిడికెడు మంది సంపన్నుల అభివృద్ధిని ప్రజల అభివృద్ధిగా చిత్రీకరిస్తున్నారు. 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్' నిజానికి దోపిడీదారుల మేళా తప్ప మరేం కాదు. ప్రజలకు చెందిన ఛత్తీస్‌గఢ్‌లోని అమూల్యమైన సంపదల వేలంకు వాళ్లను ఆహ్వానించారు. 'క్రెడిబుల్ ఛత్తీస్‌గఢ్' లేదా 'విశ్వసనీయ ఛత్తీస్‌గఢ్' నినాదం ఘరానా కార్పొరేట్లకు కొండంత హామీ ఇచ్చేవే తప్ప ప్రజల్లో విశ్వాసం రేకెత్తించే నినాదాలు కావు. పెట్టుబడులు పెట్టడానికి ఈ మేళాలో జరిగిన ఒప్పందాలతో ఛత్తీస్‌గఢ్ పేదరికం దూరమయ్యేది లేదు, నిరుద్యోగం అంతమయ్యేది లేదు. ఇది మంత్రుల, అధికారుల జేబులు నింపే కుటిల ఎత్తుగడ కూడ.

**ప్రశ్న – రమణ్ సింగ్ మీపై 'అభివృద్ధి నిరోధకులు' అని ఆరోపణలు చేస్తున్నాడు. దీనిపై మీరేమంటారు?**

**జవాబు –** అవును, ఏ పిడికెడు మంది దోపిడీదారుల సేవకు రమణ్ సింగ్ తనను తాను పూర్తిగా అర్పించుకున్నాడో, ఆ పిడికెడు మంది దోపిడీదారుల అభివృద్ధికి మేం వ్యతిరేకంగానే నిలబడ్డాం. ఛత్తీస్‌గఢ్ గడ్డను టాటా, ఎస్సార్, జిందాల్, మిత్తల్, వేదాంత, నెకో జయ్‌స్వాల్ తదితర కార్పొరేట్ సంస్థల జాగీరుగా మార్చాలనే అతని కలను మేం ఎన్నటికీ నెరవేరనియ్యం. దీని పేరే 'అభివృద్ధి నిరోధకత' అయితే మేం ఆ ఆరోపణను సగర్వంగా స్వీకరిస్తాం.

**ప్రశ్న – రావ్‌ఘాట్ ప్రాజెక్టును మీరెందుకు వ్యతిరేకిస్తున్నారు? దీన్ని ప్రారంభించకుంటే భిలాయ్ ఉక్కు పరిశ్రమకు ముడి సరుకు చాలదని అంటున్నారు కదా?**

**జవాబు –** రావ్‌ఘాట్ ప్రాజెక్టును 1990వ దశకం ప్రారంభం నుండి, అంటే మా పార్టీ ఆ ప్రాంతానికి చేరుకోక ముందు నుంచే ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ఆ తర్వాత మా పార్టీ ఈ పోరాటానికి నాయకత్వం వహించింది. ప్రజలు ఈ ప్రాజెక్టును వ్యతిరేకించడం పూర్తిగా న్యాయమైనది. ఎందుకంటే ఈ ప్రాజెక్టు ఇక్కడి భూములకు, అడవులకు, నదులకు, మొత్తంగా ఇక్కడి జన జీవనానికి తీవ్ర ముప్పును తెచ్చిపెడుతుంది. ఈ ప్రాజెక్టు ఈ ప్రాంత ప్రజల అస్తిత్వాన్నే ప్రశ్నార్థకం చేస్తుంది. ఒక విస్తృతమైన ప్రాంతంలో వినాశనాన్ని తెచ్చిపెడుతూ ఏ వర్గాలను అభివృద్ధి పరుస్తారు? భిలాయ్ స్టీల్ ప్లాంట్‌కు ముడిసరుకు సంక్షోభం అనేది ఉత్త సాకు మాత్రమే అని మేం అనుకుంటున్నాం. ఇక్కడ టాటా, నెకో వంటి బడా కార్పొరేట్ కంపెనీల దోపిడీ పర్వం ప్రారంభం కానుంది. ఈ దోపిడీకి మార్గం సుగమం చేయడానికి పబ్లిక్‌రంగ కంపెనీ అయిన సెయిల్ దళారీ పని చేస్తున్నది.

ఒకవేళ ప్రభుత్వానికి ఏదైనా ప్రభుత్వరంగ కంపెనీ బాగు గురించి నిజంగానే ఆదుర్దా వుంటే అది బైలాడిల్లా గనుల నుండి అమూల్యమైన ఇనుప ఖనిజాన్ని కొల్లగట్టడాన్ని ఆపి వేయించవచ్చు కదా? నిజానికి భిలాయ్ స్టీల్ ప్లాంట్‌కు ముప్పు ఏర్పడిందిరావ్‌ఘాట్ ప్రాజెక్టు ప్రారంభం కాకపోవడం వల్ల కాదు, ప్రైవేటీకరణ, కంప్యూటరీకరణ, కాంట్రాక్టైజేషన్ తదితర కార్మిక వ్యతిరేక విధానాల వల్ల మాత్రమే.

**ప్రశ్న – ఎడ్యుకేషన్ హబ్, పోటా కేబిన్, గుజర్ బసర్ కాలేజ్ వంటివి ప్రారంభించి ఆదివాసీ ప్రాంతాల్లో అభివృద్ధిని ప్రవహింప జేస్తున్నానని చెప్పుకుంటున్నాడు. దీనిని మీరు ఏ విధంగా చూస్తారు?**

**జవాబు –** విద్యా రంగంలో కార్పొరేట్ కంపెనీల చొరబాటు నిరంతరాయంగా పెరుగుతున్నది. పేద, మధ్య తరగతి సెక్షన్ల విద్యార్థులకు విద్యావకాశాలు రోజు రోజుకూ కుంచించుకుపోతున్నాయి. విద్యను అందించాల్సిన బాధ్యత నుండి ప్రభుత్వం వైదొలుగుతున్నది. ఆదివాసీ ప్రాంతాల్లో విద్యా సౌకర్యాలు అసలే లేవు. అన్ని చోట్లా ఉపాధ్యాయుల కొరతే వుంది. రెగ్యులర్ టీచర్లను నియామకం ఎప్పుడో ఆగిపోయింది.

రక్షణ ఏర్పాట్లు సరిగా లేవు. మధ్యాహ్న భోజనం పేరుతో పిల్లలకు నాసి రకం తిండి తినిపిస్తున్నారు. పాఠశాల భవనాలు చాలినన్ని లేవు. ఇప్పటికీ చాలా మేరకు పాఠశాలలు కిరాయి భవనాల్లోనే నడుస్తున్నాయి. ప్రభుత్వ బడులు, కాలేజీల పరిస్థితి చూస్తే, ప్రభుత్వ విధానాలు ఎంత విద్యార్థి – ప్రజా వ్యతిరేకమైనవో స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు. వాస్తవం ఇది. కాని ప్రభుత్వం ఎడ్యుకేషన్ హబ్ వగైరా కొన్ని ఆర్భాటాలతో పై వాస్తవ చిత్రాన్ని మసకబార్చే ప్రయత్నం చేస్తున్నది. ఆదివాసీ సమాజంలోని అత్యుత్తమ ప్రతిభావంతులను తమ వేర్ల నుండి వేరు చేసి దోపిడీదారుల సేవలో ఉపయోగించడం కూడా ఈ పథకాల ఉద్దేశ్యం.

**ప్రశ్న – ఆహార భద్రతా పథకం అమలులో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ముందున్నదని రమణ్ సింగ్ చెప్పుకుంటున్నాడు. మీరు దీని గురించి ఏమంటారు?**

**జవాబు –** ఛత్తీస్‌గఢ్‌లోనే కాదు, మొత్తం దేశంలోనే ఆహార భద్రతా పథకం పేరుతో ప్రభుత్వాలు పెద్ద ఎత్తున ప్రజలను మోసం చేస్తున్నాయి. వాస్తవమేమంటంటే, దేశవ్యాప్తంగా ప్రభుత్వ గోదాముల్లో లక్షల టన్నుల ఆహార ధాన్యాలు మురిగిపోతున్నాయి, ఎలుకల పాలవుతున్నాయి. మరోవైపు దేశంలోని విభిన్న ప్రాంతాల్లో ఆకలి మరణాల పరిస్థితి నెలకొని వుంది. ఈ చోద్యంపై కొంత కాలంగా దేశంలో పెద్ద చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు కూడా గోదాముల్లో మురిగిపోతున్న ధాన్యాన్ని పేదలకు ఉచితంగా పంచమని ఆదేశమిచ్చిన విషయం తెలిసినదే. ప్రభుత్వాలు తమ ఎన్నికల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఈ పథకాలను ప్రారంభించింది. నెలకు 5 లేదా 7 కిలోల బియ్యంతో ఎవరూ బతకలేరనే విషయం ఎవరికీ తెలువనిది కాదు. ఇందులో కూడా కూడా అవినీతి ఎంత పేరుకుపోయిందో మీడియాలో నిరంతరంగా వార్తలు వస్తూనే వున్నాయి. అందుకని విస్తృత ప్రచారాన్ని పొందిన రమన్‌సింగ్ ఆహార భద్రతా పథకం ఉత్త ప్రజాకర్షక పథకమే తప్ప మరేం కాదు. దీనివలన పేదల ఆకలి తీరేది లేదు, ఎవరికీ ఆహార భద్రత లభించేది లేదు.

**ప్రశ్న – ఇంకా చాలానే అభివృద్ధి పథకాలున్నాయి కదా, మనరేగా వంటివి. వీటి గురించి మీరేమంటారు?**

**జవాబు –** మనరేగా గురించి రమణ్‌సింగ్ ఎంతగా డబ్బా కొట్టుకుంటున్నప్పటికీ వాస్తవం ఏమిటంటే రాష్ట్రంలో వీటి పనులు 45 శాతం కన్నా మించి జరగనే లేదు. ఇందులో కూడ తప్పుడు హాజరీలు నింపి, నకిలీ సంతకాలు పెట్టి, పాస్‌బుక్కులలో అవకతవకలకు పాల్పడి కోట్లాది రూపాయలను దిగమింగుతున్నారు. సర్పంచ్, పంచాయితీ కార్యదర్శి నుండి కలెక్టర్, మంత్రుల దాకా అందరూ అవినీతిలో మునిగి తేలుతున్నారు. ఒకవేళ ఈ పథకం సరిగా అమలైందని అనుకున్నా, కుటుంబంలో ఒక్క సభ్యునికి 150 రోజులు మాత్రమే దొరికే పనితో కుటుంబమంతా సాలు పొడుగూతా పొట్ట నింపుకోవడం ఎలా సాధ్యం?

ముఖ్యమంత్రి పేరుతో నడుస్తున్న స్మార్ట్‌కార్డ్ పథకం కూడ ఇటువంటిదే. ఇది కార్పొరేట్ ఆసుపత్రులకు లాభాలు చేకూర్చే పథకమే తప్ప మరేమీ కాదు. ఇందులో ఏ రోగానికి ఎంత ఖర్చుతో వైద్యం చేయాలని నిర్ధారించారో అది అసలు సాధ్యమే కాదు. అందుకే చిన్న చిన్న రోగాలకు కొద్ది పాటి వైద్యం చేస్తూ ప్రజల అవసరాలను తమ స్వార్థ ప్రయోజనాలకు అనువుగా వుపయోగించుకుంటూ నర్సింగ్‌హోంల యజమానులు బాగా గడిస్తున్నారు.

గమనించాల్సిన విషయం ఏమిటంటే ఇలాంటి పథకాలేవీ ప్రజలపై ప్రేమతో కాదు, వాళ్ల నయావుదారవాద విధానాలకు వ్యతిరేకంగా ప్రజల్లో పెల్లుబుకుతున్న అసంతృప్తిని చల్లార్చడానికి మాత్రమే తెస్తున్నారు.

**ప్రశ్న – జీరంఘాటీలో మీరు కాంగ్రెస్ నాయకుల కాన్వాయ్ మీద ఎందుకు దాడి చేశారు? దీనిని మావోయిస్టుల వ్యూహంలో మార్పుగా చూడవచ్చా?**

**జవాబు –** మా కమిటీ విడుదల చేసిన పత్రికా ప్రకటనలో మొదటే చెప్పినట్టుగా, సల్వాజుడుం, ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లకు ప్రతిఘటనగానే మేం ఈ దాడి చేశాం. నిజానికి ఇది మా ఆత్మరక్షణా యుద్ధంలో భాగమైన ఎత్తుగడలపరమైన ప్రతి దాడి. మొదట సల్వాజుడుం, ఇప్పుడు ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో కొనసాగుతున్న ఫాసిస్టు దమనకాండలో వందలాది ఆదివాసీలు దారుణ హత్యకు గురయ్యారు. వందలాది గ్రామాలను తగులబెట్టారు. భారీ వినాశనానికి పాల్పడ్డారు. వీటన్నింటికీ ప్రతీకార చర్యగా ఈ దాడిని చూడాలి. ఇందులో వ్యూహం మారడం అనే ప్రశ్నే లేదు. దీనికి ముందు కూడా మేం పలుసార్లు దోపిడీ రాజకీయ పార్టీలకు చెందిన కొందరు ప్రతీఘాత నాయకులపై దాడులు చేశాం. ఇది ఈ రకమైన మొదటి దాడేమీ కాదు. అయితే ఇదొక భారీ చర్య. చారిత్రాత్మకమైనది కూడా. ముఖ్యంగా మహేంద్ర కర్మ హతం కావడం అనేది ఈ దాడిలో మేం సాధించిన ముఖ్య విజయం.

**ప్రశ్న – ఇది ప్రజాస్వామ్యంపై దాడి కాదా?**

**జవాబు –** మేం మొదటే చెప్పినట్టుగా దోపిడీ పాలకులకు ప్రజాస్వామ్యం పేరెత్తే నైతిక హక్కు లేదు. సల్వాజుడుంను చట్ట విరుద్ధమని సుప్రీం కోర్టు కూడ ప్రకటించింది. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ తయారు చేసిన ముసాయిదా నివేదికలో టాటా, ఎస్సార్ వంటి కార్పొరేట్ పెద్దల ప్రయోజనాల కోసమే సల్వాజుడుంను నడుపుతున్నారని పేర్కొన్నారు. ఇటువంటి ఫాసిస్టు సల్వాజుడుం నాయకులను లక్ష్యం చేసుకొని జరిగిన దాడి ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి ఎన్నటికీ కాదు. దీన్ని ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా మాట్లాడుతున్న వాళ్లు, సింగారం నుండి మొదలుకొని ఎడ్స్‌మెట్ట వరకూ పదుల కొద్ది గ్రామాల్లో చేసిన హత్యాకాండల సమయంలో ఎందుకు నోరుమెదపలేదో చెప్పాలి. మహేంద్ర కర్మ, నందకుమార్ పటేల్, వీసీ శుక్లా వంటి నాయకులు చనిపోయినప్పుడే వాళ్లకు ప్రజాస్వామ్యం గుర్తుకు వస్తుందా? ఇది కచ్చితంగా రెండు

నాల్కల ధోరణి.

**ప్రశ్న – నందకుమార్ పటేల్‌ను, ఆయన కొడుకు దినేష్ పటేల్‌ను బందీలుగా పట్టుకొని చంపేయడం ఎంత వరకు సమంజసం?**

**జవాబు –** ఈ దాడిలో నిర్దోషులు కొంత మంది, మా పార్టీకి శత్రువులు కాని కాంగ్రెస్ నాయకులు కూడా కొందరు చనిపోయారు. దీనిపై మా కమిటీ ముందే విచారం ప్రకటించింది. ఈ దాడిలో చనిపోయిన వాళ్లందరూ ప్రభుత్వ సాయుధ బలగాలకు, పీఎల్‌జీఏకు నడుమ జరిగిన భీకర కాల్పుల్లోనే చనిపోయారనే విషయాన్ని ఇక్కడ తప్పక గమనించాలి. మహేంద్ర కర్మ కాకుండా నంద కుమార్ పటేల్, ఆయన కొడుకు దినేష్ పటేల్‌లను తప్ప మరెవ్వరినీ మా కామ్రేడ్స్ బందీలుగా పట్టుకొన్న తర్వాత చంపలేదు. తర్వాత ఈ మొత్తం చర్యను మేం వున్నత స్థాయిలో సమీక్షించాము. మా సమీక్ష సారమేమంటంటే మహేంద్ర కర్మ వంటి ప్రజా శత్రువును నిర్మూలించడంలో చారిత్రాత్మక విజయాన్ని సాధించడంతో పాటు ఈ దాడిలో కొన్ని సీరియస్ పొరపాట్లు కూడా జరిగాయి. మొట్టమొదట దినేష్ పటేల్‌ను చంపడం పెద్ద తప్పిదం. ఎందుకంటే అతను మా పార్టీకి, వుద్యమానికి వ్యతిరేకంగా ఎప్పుడూ ఏ పనీ చేయలేదు. అతనికి ప్రజా వ్యతిరేక చరిత్ర కూడా ఏమీ లేదు. ఈ దాడికి నాయకత్వం వహించిన పీఎల్‌జీఏ కమాండ్ తొందరపాటుతో ఈ తప్పుడు నిర్ణయం తీసుకుంది. ఇక నంద కుమార్ పటేల్‌ను చంపడం విషయానికొస్తే, అతను పదేళ్ల క్రితం హోంమంత్రిగా మా ఉద్యమాన్ని అణచడానికి క్రియాశీలంగా పని చేసినది వాస్తవమే. అయితే గత పది సంవత్సరాలుగా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారానికి దూరంగా వున్నది. వ్యక్తిగతంగా కూడా నందకుమార్ పటేల్ మా వుద్యమానికి వ్యతిరేకంగా ప్రత్యక్షంగా ముందుకు రావడం లేదు. కనుక అతన్ని కూడా చంపకుండా వుండాల్సిందని గుర్తించాము. అయితే కాంగ్రెస్ నేతృత్వంలో కేంద్రంలో అధికారంలో వున్న యూపీఏ ప్రభుత్వం సహకారంతోనే ఇక్కడ ఛత్తీస్‌గఢ్‌లో ప్రజలపై నేడు భారీ నిర్బంధం కొనసాగుతున్నదనే విషయంలో అస్పష్టత ఏమీ లేదు. ఆదివాసుల నరమేధాలు కొనసాగుతున్నాయి. అయినప్పటికీ, కాంగ్రెస్ అధ్యక్ష పదవిలో వున్న సమయంలో సార్కిన్‌గూడ, ఎడ్స్‌మెట్ట వంటి హత్యాకాండలకు వ్యతిరేకంగా గొంతెత్తుతున్న సందర్భంలో నందకుమార్ పటేల్‌ను చంపాలనే నిర్ణయం తీసుకోవడం సరైనది కాదు. దీనితో పాటు కాల్పుల సమయంలో కూడ కొన్ని అదనపు జాగ్రత్తలు తీసుకొని వుంటే హతాహతుల సంఖ్యను తగ్గించగలిగేవాళ్లం. వీటిని ఈ దాడిలో జరిగిన తప్పిదాలుగా మేం లోతుగా గుర్తిస్తున్నాం. భవిష్యత్‌లో ఇటువంటి తప్పిదాలు పునరావృతం కాకుండా వుండడం కోసం ఈ సమీక్షను మేం మా శ్రేణుల్లోకి తీసుకెళ్లి విద్యగరుపుతున్నాం. దీన్ని నేడు మీ ద్వారా అందరికీ తెలియబరుస్తున్నాం.

**ప్రశ్న – ఈ దాడి ఒక రాజకీయ కుట్ర ఫలితం అనేది నిజమేనా?**

**జవాబు –** కాదు, నిజం కాదు. 'పరివర్తనా యాత్ర'కు సంబంధించిన సమాచారం పీఎల్‌జీఏకు ప్రజల ద్వారానే తెలిసింది. దాని ఆధారంగానే అది దాడికి పథకం రూపొందించుకుంది. కాంగ్రెస్, బీజేపీలు రెండూ పరస్పరం తిట్టుకోవడం కోసం, ప్రత్యేకించి రానున్న ఎన్నికల రీత్యా తలాతోక లేని ఆరోపణలు చేసుకుంటున్నాయి. ఇది వాళ్ల రాజకీయ దివాళాకోరుతనానికే నిదర్శనం.

**ప్రశ్న – మీ హిట్‌లిస్ట్‌లో ఎవరెవరు వున్నారు?**

**జవాబు –** మేం ఏదో హిట్‌లిస్ట్ తయారు చేసుకొని వుంటామనేది నిజం కూడ కాదు. ఇది పూర్తిగా మీడియా చేసే ప్రచారం. ఏ నాయకుడైనా, అధికారైనా మా ఉద్యమాన్ని నిర్మూలించే లక్ష్యంతో దూకుడుగా ముందుకు వస్తేనో, ప్రజా ప్రయోజనాలకు వ్యతిరేకంగా పని చేస్తేనో వాళ్లను మేం ప్రజా శత్రువుగా భావిస్తాం. అటువంటి వారిలో మేం ఎవరిని ఏ రూపంలో శిక్షిస్తామనేది సమయం, స్థలం, సందర్భం, ప్రజల డిమాండ్, అవసరం మొదలైన పలు ఇతర అంశాలపై ఆధారపడి వుంటుంది.

**ప్రశ్న – మీ పార్టీ జడ్జీలను బెదిరించినట్టుగా ఇటీవల మీడియాలో వార్తలు వచ్చాయి. ఇది నిజమేనా?**

**జవాబు –** ముందుగా మీకు ఒక విషయం చెప్తాను. ఛత్తీస్‌గఢ్ జైళ్లల్లో నేడు మూడు వేల మందికి పైగా ఆదివాసులు బందీలుగా వున్నారు. ఈ సంఖ్య ప్రతి రోజూ పెరుగుతూనే వుంది. వీళ్ల మీద అనేక తప్పుడు కేసులు బనాయించబడ్డాయి. ఛత్తీస్‌గఢ్ కోర్టుల్లో బెయిల్ దొరకడం అనేది అసాధ్యం అయిపోయింది. ఒకవేళ శిక్షపడినా రెండు, మూడేళ్ల లోపే విడుదల కాగలిగినంత చిన్న చిన్న కేసుల్లో కూడా ఏడు, ఎనిమిదేళ్లు జైలులో మగ్గిపోవాల్సి వస్తున్నది. జైళ్లలో తిండి సరిగా దొరకదు. జబ్బు చేస్తే వైద్య సదుపాయం వుండదు. మొత్తంగా అత్యంత అమానవీయ పరిస్థితిలో ఆదివాసులు జైళ్లల్లో జీవన్మరణ పోరాటం చేస్తున్నారు. పేదరికం వల్ల అనేక మంది లాయర్లను కూడా నియమించుకోలేకపోతున్నారు. నిర్దోషులు, నిస్సహాయులైన ఆదివాసులకు కొంతమంది జడ్జీలు తప్పుడు సాక్ష్యాలతో జీవిత ఖైదు సహా పలు కఠిన శిక్షలు విధిస్తున్నారు. అవినీతిపరులకు, అత్యాచారాలకు పాల్పడ్డవారికి, దొంగ రాజకీయ నాయకులకు కోర్టుల్లో ఎప్పుడూ ఏ శిక్షలూ పడవు. పేదలకే శిక్షలు. ఇది ఈ న్యాయవ్యవస్థ వర్గ పక్షపాతాన్ని పట్టి చూపుతుంది. పచ్చి అభివృద్ధినిరోధకులు, దోపిడీ పాలక వర్గాలకు నమ్మినబంట్లయిన కొంత మంది జడ్జిలు మా కామ్రేడ్స్‌కు, సాధారణ ఆదివాసులకు పనిగట్టుకొని కఠిన శిక్షలు విధిస్తున్నారు. ఈ రకమైన ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడవద్దనీ, ఇటువంటి వారు స్వయంగా ఏదో ఒకరోజున ప్రజాకోర్టులలో విచారణను ఎదుర్కోవల్సి వుంటుందని ముందస్తుగా తెలియజేయడం మాత్రమే మేం చేస్తున్నది.

**ప్రశ్న – నేమిచంద్ జైన్ అనే విలేకరి హత్యకు సంబంధించి మీ పార్టీ ఏం చెబుతుంది?**

**జవాబు –** నేమిచంద్ హత్య జరిగిన సమయంలో కొంత గందరగోళ పరిస్థితి ఉత్పన్నమైంది. ఈ ఘటనకు పాల్పడ్డది ఎవరు? ఎవరి

నిర్ణయం మేరకు ఇది జరిగింది అనేది ఆరా తీయడానికి చాలానే సమయం పట్టింది. తర్వాత స్పష్టమైంది ఏంటంటే మా పార్టీకి చెందిన ఒక కింది కమిటీ తప్పుడు అంచనాలు, ఒంటెత్తు పోకడ నిర్ణయం కారణంగా ఈ విచారకరమైన ఘటన జరిగిందనేది. మేం దీని పట్ల తీవ్రంగా పశ్చాత్తాపం చెందుతున్నాం. నేను మా స్పెషల్ జోనల్ కమిటీ తరఫున నేమిచంద్ కుటుంబీకులకు, మిత్రులకు తీవ్ర సంతాపం ప్రకటిస్తున్నాను. మా పార్టీ దీనిపై ఇంతకు ముందే బహిరంగ క్షమాపణలు కోరుకుంది. ప్రజాపంథా – వర్గపంథా విషయంలో మా పార్టీ శ్రేణుల చైతన్య స్థాయిని పెంచాల్సిన అవసరం మరింతగా ఉందనే విషయాన్ని ఈ ఘటన మరోసారి మాకు నేర్పింది. ఇక మీదట ఇటువంటి బాధాకరమైన ఘటనలు పునారవృతం కానివ్వమని నేను మీడియా ద్వారా మరోసారి ప్రజలకు హామీ ఇస్తున్నా.

**ప్రశ్న – శుభ్రాంశు ఛౌధరిని మావోయిస్టులు బెదిరించారంటూ అంతర్జాతీయ విలేకరుల సంఘం మిమ్మల్ని నిందించింది. ఏమిటీ విషయం?**

**జవాబు –** శుభ్రాంశు ఛౌధరి ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఒక గౌరవనీయ విలేకరి. ఆయన సీజీనెట్ స్వర ద్వారా ప్రజల సమస్యలకు ఒక వేదికను కల్పించడానికి ప్రయత్నించాడు. సల్వాజుడుం రోజుల్లో ఆయన దాన్ని వ్యతిరేకిస్తూ అనేక వ్యాసాలు రాశాడు. అతన్ని మేం చాలా గౌరవిస్తూ వచ్చాం. 'లెటజ్ కాల్ హిం వాసు' అనే పేరుతో ఇటీవల ఆయన రాసిన ఒక పుస్తకం ప్రచురించబడింది. ఆ పుస్తకంలో ఆయన ఎన్నో అబద్ధాలు, అర్ధ సత్యాలతో పాటు కొన్ని సత్యాలను తారుమారు చేసి రాశాడు. నేడు మా ఉద్యమానికి వ్యతిరేకంగా దోపిడీ వర్గాలు చేస్తున్న దుష్ప్రచార క్యాంపెయిన్‌కు ఆయన పుస్తకంలోని అంశాలు చాలా మేరకు సరిపోలుతున్నాయి. డాక్టర్ వినాయక్ సేన్, జీత్ గుహ నియోగి, ముక్తి గుహ నియోగిలతో మాతో సంబంధాలున్నాయని రాయడం వల్ల కూడా ఆ పుస్తకం వివాదస్పదం అయింది. ఏ వ్యక్తికైనా ఒక నిషేధిత సంస్థతో సంబంధాలున్నాయనే ఆరోపణ చేస్తే, అది నిజమే అయినా కాకపోయినా గాని, ఆ వ్యక్తి భద్రతకు ఎంత ముప్పో మీకు తెలిసిందే. ఇది జర్నలిస్టుల నైతిక నియమాలకు పూర్తిగా విరుద్ధమైనది. మా పార్టీ ఇచ్చిన ప్రకటనల్లో చెప్పిన దాన్ని, మా పైస్థాయి నాయకత్వ కామ్రేడ్స్ ఆయనకు స్వయంగా చెప్పిన దాన్ని గాలికొదిలేసి, ఇక్కడా అక్కడా పోగుచేసిన అరకొర విషయాలను వెలువరించడం ఆదర్శ జర్నలిజం ఎంత మాత్రమూ కాదు. దీని తర్వాత మే 25 జీరంఘాటీ దాడి నేపథ్యంలో శుభ్రాంశు ఒక వ్యాసం రాశాడు. అందులో ఆయన మా దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలో జరిగిన నిర్మాణపరమైన మార్పుల్ని పేర్కొంటూ నాయకత్వం మధ్యన మనస్పర్ధలు వున్నట్టు కల్పితాలు రాశాడు. మేం దీన్ని ఖండించాం. దీని పట్ల మా నిరసన ప్రకటించాం. తన ఇష్టం వచ్చినట్టు రాసే స్వతంత్రం తనకుందని ఆయన ఎలాగైతే భావిస్తున్నాడో, అతని తప్పుడు వ్యాఖ్యానాలను, అబద్ధపు ఆరోపణలను ఖండించే అధికారాన్ని మేం కూడ వుపయోగించుంటాం కదా! మేం చేసిందిదే. అంతర్జాతీయ జర్నలిస్టుల ఫెడరేషన్‌కు ఇలాంటి అపోహ ఎందుకు కలిగిందో మాకు తెలియదు. ఈ విషయంలో మా ఎస్‌జెడ్‌సీ విడుదల చేసిన పత్రికా ప్రకటన ఇప్పటికీ పబ్లిక్ డొమెయిన్‌లో వుంది. కావాలంటే ఎవరైనా చూడొచ్చు, అందులో మా బెదిరింపేమైనా వుందా అనేది అర్థమవుతుంది.

**ప్రశ్న – ఈ మధ్యన మీ పార్టీకి చెందిన కొందరు కమాండర్లు, కేడర్లు పోలీసుల ముందు లొంగిపోయారు. ఇలా ఎందుకు జరుగుతున్నది?**

**జవాబు –** విప్లవ పోరాటంలో, ముఖ్యంగా దీర్ఘకాలిక ప్రజాయుద్ధంలో అనేక ఎగుడు దిగుళ్లు వుంటాయి. అనేక కఠిన దశల్ని దాటాల్సి వుంటుంది. వీటన్నిటి మధ్యన ఒక విప్లవకారుడిగా నిలబడడానికి తగినంత సైద్ధాంతిక, రాజకీయ చైతన్యం, దృఢ సంకల్పం చాలా అవసరం. ముఖ్యంగా శత్రువు నిరంతరాయంగా కొనసాగిస్తున్న దాడులను, మానసిక యుద్ధాన్ని అర్థం చేసుకొని, ప్రజలపై, మా–లె–మా సిద్ధాంతంపై అచంచల విశ్వాసంతో పురోగమించడం తప్పనిసరి అవుతుంది. ఇందులో ఏదైనా లోపం వుంటే వ్యక్తులు పతనం కావడం అనివార్యం. ఇటీవల శత్రువు ముందు లొంగిపోయిన కొందరు కామ్రేడ్స్‌లో ఇదొక ముఖ్య లోపంగా వుండింది.

భారత విప్లవం నేడు అనేక సవాళ్లను ఎదుర్కొంటూ ఒక కఠిన పరిస్థితి గుండా సాగుతున్నది. శత్రువు పూర్తి కేంద్రీకరణతో సైనిక దాడితో పాటు భారీ దుష్ప్రచార క్యాంపెయిన్‌ను కూడ కొనసాగిస్తున్నాడు. కార్పొరేట్ మీడియాను బాగా వుపయోగించుకుంటున్నాడు. విషపూరిత సామ్రాజ్యవాద సంస్కృతి లోతట్టు ఆదివాసీ ప్రాంతాల్లో కూడా విచ్చలవిడిగా చొరబడుతున్నది. వీటన్నిటి ప్రభావం మా కేడర్లపై కూడ పడుతున్నది. వీటి పట్ల అప్రమత్తంగా వుంటూ శత్రు ఎత్తులను చిత్తు చేయాల్సిన అవసరం వున్నది. యావత్ కేడర్లలో భావజాలపరమైన బోధనా స్థాయిని పెంచాల్సిన అవసరం వున్నది.

**ప్రశ్న – మీ పార్టీలో వివక్ష వుందని, మహిళలపై దోపిడీ కొనసాగుతున్నదని వాళ్లంటున్నారు?**

**జవాబు –** అన్ని రకాల వివక్షలను, దోపిడీలను అంతం చేయడమే విప్లవోద్యమ మౌలిక లక్ష్యం. దశాబ్దాలుగా సాగుతున్న పోరాటం ఫలితంగా ప్రజలు ఈ దిశగా అనేక విజయాలు సాధించారు. మహిళలపై దోపిడీ పీడనలలో చెప్పుకోదగిన తగ్గుదల వచ్చింది. ఇవి ఎవరూ నిరాకరించలేని వాస్తవాలు. సరెండర్ అయిన వాళ్లు పోలీసులు ఎలా చెప్పమంటే అలా చెబుతారనే విషయం అందరికీ తెలిసిందే. మా వుద్యమాన్ని రాజకీయంగా, సైద్ధాంతికంగా ఎదుర్కొనలేకనే పాలక వర్గాలు బ్రిటిష్ వాళ్ల నుండి వారసత్వంగా నేర్చుకున్న 'విభజించు – పాలించు' అనే కుటిల విధానాన్ని తలకెత్తుకుంటున్నారు. అందులో భాగంగా మా పార్టీలో వివక్ష, మహిళలపై దోపిడీ వుందని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. దీన్ని ఎవరూ నమ్మరు.

**ప్రశ్న – మీ పార్టీలో కేడర్లకు బలవంతంగా వ్యాసెక్టమీ చేయిస్తారా?**

**జవాబు –** ఒక వ్యక్తి ఇష్టానికి వ్యతిరేకంగా పార్టీలో చేర్చుకోవడమే సాధ్యం కానపుడు బలవంతంగా వ్యాసెక్టమీ చేయించడమనే ప్రశ్నే

అసంబద్ధమైంది కదా? కనుక ఈ ఆరోపణ నిరాధారమైంది, అర్థం లేనిది. హాస్యాస్పదమైంది కూడ.

అయితే వాస్తవం ఏమిటంటే మా పార్టీలో పని చేస్తున్న అత్యధిక దంపతులు పిల్లలను కనగూడదని నిర్ణయించుకుంటున్నారు. ప్రస్తుతం నెలకొన్న యుద్ధ పరిస్థితుల రీత్యా, ఆచరణలో వచ్చే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకున్నపుడు ఈ నిర్ణయం సముచితమైనదే. కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ఇదేమీ కొత్త విషయం కూడ కాదు. దోపిడీపీడనలు లేని సమసమాజాన్ని నిర్మించే కర్తవ్యాన్ని భుజాలకెత్తుకొని నిస్వార్థంగా పని చేసే కామ్రేడ్స్ ఈ విధంగా పిల్లలను కనగూడదనే నిర్ణయం తీసుకోవడం పార్టీలోనే కాదు, మొత్తం సమాజానికే ఒక ఉన్నతాదర్శంగా వుంటుంది.

**ప్రశ్న – అబూజ్‌మాడ్‌లో భారత సైన్యం ఏర్పాటు చేయబోతున్న శిక్షణా స్కూలును మీరెందుకు వ్యతిరేకిస్తున్నారు?**

**జవాబు –** మాడ్‌లో భారత సైన్యం శిక్షణా స్కూలును ఏర్పాటు చేయడాన్ని భారతీయ పౌరులందరూ వ్యతికించాలి. మా పార్టీ నాయకత్వంలో కొనసాగుతున్న ప్రజాయుద్ధాన్ని అణచివెయ్యాలనే వుద్దేశ్యంతో దోపిడీ పాలకవర్గాలు ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో భారీ అణచివేత క్యాంపెయిన్‌ను నడుపుతున్నాయి. భారత సైన్యాన్ని మోహరించే పథకం ఇందులో భాగంగా వుంది. దీనికి ముందస్తు సన్నాహంగానే 'శిక్షణ' అనే సాకుతో సైన్యాన్ని దించుతున్నారు. మాడ్‌లో 750 చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని సైన్య శిక్షణకు కేటాయిస్తే గనుక మాడ్ ప్రజల, ప్రత్యేకించి ప్రాచీన జన సముదాయాల్లో ఒకటైన మాడియా ప్రజల ఉనికే లేకుండా పోవడం ఖాయం. ఇక్కడ ఏ విదేశీ శక్తితో యుద్ధం చేయాల్సింది లేదు కాబట్టి కూడ సైన్యాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలి. ఈరోజు కశ్మీర్, ఈశాన్య ప్రాంత అనుభవాలు మన ముందున్నాయి. అక్కడ సైన్యం చేస్తున్నదేమిటో అందరికీ తెలిసిందే. కాబట్టి ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేయాల్సిందిగా మా స్పెషల్ జోనల్ కమిటీ దేశ ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నది.